క్లుప్తంగా

సత్యదేవుని దర్శించిన విదేశీ వ్యవహారాల శాఖ డైరెక్టర్



సత్యదేవుని సన్నిధిలో వేద పండితుల ఆశీర్వచనాలు పొందుతున్న ఉమాశంకర్ దంపతులు

తొండంగి: కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ డైరెక్టర్ యడ్ల ఉమాశంకర్ శుక్రవారం అన్నవరంలో రత్నగిరిపై సత్యదేవుని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కొండపైకి సతీసమేతంగా వచ్చిన ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సత్యదేవుని దర్శనం అనంతరం వారికి వేదపండితులు ఆశీర్వచనాలు అందజేయగా దేవస్థానం అధికారులు సత్యదేవుని చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు. పీఆర్వో దామెర కృష్ణారావు, ఏపీఆర్వో గణపతి పాల్గొన్నారు.

తక్కువ ధరకు హైబ్రిడ్ కొబ్బరి మొక్కలు

రౌతులపూడి: కోనసీమ జిల్లా అంబాజీపేటలోని కొబ్బరి పరిశోధనా సంస్థ వద్ద హైబ్రీడ్ కొబ్బరి మొక్కలు తక్కువ ధరకు లభించనున్నాయని ఉద్యానవన శాఖ అధికారి అరుణ్‌కుమార్ తెలిపారు. ఒక్కో మొక్క రూ.300లకు విక్రయిస్తున్నట్టు తెలిపారు. అవసరమైన రైతులు తమ పట్టాదారు పాస్‌పుస్తకం నకలు, ఆధార్‌కార్డు నకలు అవసరమైన మొక్కలకు సంబంధించి బ్యాంకు డీడీతో నేరుగా కొబ్బరి పరిశోధన సంస్థ కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. గరిష్టంగా ఒక పాసు పుస్తకంపై 30 మొక్కలు మాత్రమే ఇస్తారన్నారు. మరిన్ని వివరాలకు 73826 33653 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వరలక్ష్మీదేవి నమోస్తుతే..

- భక్తిశ్రద్ధలతో వ్రతాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

ఏలేశ్వరం: శ్రావణమాసంలో రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ప్రజలు వరలక్ష్మీదేవి వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఏటా మాదిరిగానే మహిళలు సంప్రదాయబద్ధంగా వ్రతమాచారించారు. ఉదయాన్నే తలస్నానం చేసి నూతన వస్త్రాలు ధరించి వరలక్ష్మీదేవి అమ్మవారి చిత్రపటాలకు ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిది రకాల పిండివంటలతో చీర, రవికె, బంగారం రూపు అమ్మవారికి నైవేద్యం పెట్టి పూజలు నిర్వహించారు. అనంతరం ముత్తయిదువులకు వాయానాలు ఇచ్చారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, నర్సీపట్నం రోడ్, తోటవీధి, దిబ్బలపాలెం తదితర ప్రాంతాల్లోని దుర్గమ్మ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రౌతులపూడి: శ్రావణమాసంలో రెండో శుక్రవారం సందర్భంగా మండల వ్యాప్తంగా వరలక్ష్మీదేవి వ్రతాలు అత్యంత వైభవంగా జరిగాయి. తెల్లవారుజామునే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాలకు బారులు తీరారు. తమ ఇళ్లలోని అమ్మవార్ల విగ్రహాలను పసుపు, కుంకమ, గంధం, పూలు, పండ్లతో లక్ష్మీదేవి అత్యంత సుందరంగా అలంకరించారు. పలు రకాల పిండి వంటలను తయారు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ప్రత్యేక మంత్రోచ్చరణలతో లక్ష్మీదేవి అమ్మవారిని పూజించారు. వరలక్ష్మీదేవి వ్రతాల సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రౌతులపూడిలో కొలువుదీరిన కనకదుర్గమ్మ ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.



ఏలేశ్వరంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ప్రత్తిపాడు: శ్రావణమాసంలో రెండో శుక్రవారం సందర్భంగా మండల ప్రజలు వరలక్ష్మీ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి ఆలయాలకు పోటెత్తారు. స్థానిక అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి వారి పంచాయతన క్షేత్రం, శివాలయం, బైపాస్ రోడ్డులోని దుర్గమ్మ ఆలయాలు, ఎంప్లాయిస్ కాలనీలోని షిర్డీసాయి మందిరం, పంచాయతీ కార్యాలయం వద్ద అభయ దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తరకంచి వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఏలూరు, చినశంకర్లపూడి, పెదశంకర్లపూడి, లంపకలోవ తదితర గ్రామాల్లోని దుర్గమ్మ అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

శంఖవరం: మండలంలోని అన్ని గ్రామాల్లోనూ మహిళలు భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. శ్రావణ మాసంలో రెండో శుక్రవారం కావడంతో గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాలకు భక్తులు పోటెత్తారు. సీతంపేటలో వేంచేసిన మీనాక్షి దుర్గఅమ్మవారిని పండితులు పట్టు వస్త్రాలతో అలంకరించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



ప్రత్యేక అలంకరణలో సీతంపేట మీనాక్షి అమ్మవారు



గోకవరంలో వెండి, బంగారు ఆభరణాలతో వరలక్ష్మీదేవిగా దర్శనమిస్తున్న కనకదుర్గమ్మ

తొండంగి: శ్రావణ మాసంలో రెండో శుక్రవారం సందర్భంగా మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గోపాలపట్నం నేరేళ్లమ్మ, దుర్గామాత ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎ. కొత్తపల్లిలో భువనేశ్వరి, తొండంగిలో రాజరాజేశ్వరి, దానవాయిపేటలో కామాక్షి, దుర్గామాత ఆలయాలకు ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు. దాతల సహకారంతో భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు.

గోకవరం: వరలక్ష్మీ వ్రతాన్ని మండల ప్రజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి ఇంట్లో వరలక్ష్మీదేవి పూజలు నిర్వహించి ముత్తయిదువులకు వాయినాలు ఇచ్చారు. మండలంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక దేవీచౌక్ ఆలయంలో కనకదుర్గమ్మను ఆలయ అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ వెండి, బంగారు ఆభరణాలతో వరలక్ష్మీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేల సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

కిర్లంపూడి మండలంలో..

కిర్లంపూడి: శ్రావణ మాసంలోని రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని మండలంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జగపతినగరంలోని అభయ దుర్గమ్మ, చిల్లంగిలో కనకదుర్గమ్మ, కిర్లంపూడిలో వనదుర్గమ్మ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.

ఎంపీడీఓగా కుమార్‌బాబు బాధ్యతల స్వీకరణ

ప్రత్తిపాడు: మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ)గా ఎంవీఆర్ కుమార్ బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన ఎస్.డేవిడ్‌రాజ్ విశాఖజిల్లాకు బదిలీ అయ్యారు. రంపచోడవరం మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారిగా పనిచేస్తున్న ఎంవీఆర్ కుమార్‌బాబు పదోన్నతిపై గతేడాది ఇక్కడకు ఎంపీడీఓగా వచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆయన కృష్ణాజిల్లా పెనుమలూరుకు బదిలీ అయ్యారు. తిరిగి ప్రత్తిపాడుకు బదిలీపై వచ్చిన కుమార్‌బాబుకు ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, ఈఓఆర్డీ కేవీవీఎస్ కాశీ విశ్వనాథం, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

జగ్గంపేట: శాస్త్రీయ విధానంలో వరినాట్లు వేయడంతో పాటు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ భ్రమరాంబ అన్నారు. మండలంలోని గొల్లలగుంటలో ఏఓ రెడ్ల శ్రీరామ్ ఆధ్వర్యంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ భ్రమరాంబ ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. వరినాట్లు వేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, సాగులో మెళకువలను వివరించారు. పొలం గట్లపై బంతి మొక్కలు నాటడం ద్వారా కీటకాల వ్యాప్తిని నివారించవచ్చన్నారు. వరిసాగులో రసాయన ఎరువులు, పురుగు మందులు విరివిగా వాడడం వల్ల వాటి అవశేషాలు పంట ఉత్పత్తుల్లో చేరి ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తున్నాయన్నారు. సేంద్రియ సాగుపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయ సహాయకుడు డి.రఘు, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన పంటలే లక్ష్యం

గండేపల్లి: పంటల సాగులో ఆరోగ్యకరమైన అధిక దిగుబడులు సాధించడమే పొలంబడి ముఖ్య ఉద్దేశమని మండల వ్యవసాయాధికారి ఎ.సద్గురు మూర్తి తెలిపారు. మండలంలోని గండేపల్లిలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రకృతి సాగుపై దృష్టి సారించాలన్నారు. ఖరీఫ్ పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ అంజలి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భాస్కరరావు, రమ్య, వీహెచ్ఏ సాయికిరణ్, రైతులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీహోమం

తొండంగి: అన్నవరం రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. 50 మంది భక్తులు రూ.750 చొప్పున టికెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు. సత్యదేవుని ప్రధానాలయంలో అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి రుత్విక్కులు లక్షకుంకుమార్చనలు నిర్వహించారు.

ముంగర్లమ్మ జాతర ప్రారంభం

కిర్లంపూడి: వేలంకలో వేంచేసిన ముంగర్లమ్మ జాతర మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 11 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి పొన్నులు వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత 72 సంవత్సరాలుగా అమ్మవారి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 24న అమ్మవారి ఆలయం వద్ద జాగారం, 25న గ్రామాల్లో పండగ, 26న భారీ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. అమ్మవారి జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

పసుపుకొమ్ముల అలంకరణలో వరమహాలక్ష్మి

తుని: స్థానిక చిట్టూరి మెట్రోలో వేంచేసిన వరమహాలక్ష్మి అమ్మవారు పసుపు కొమ్ముల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీవ్రతం సందర్భంగా వేద పండితులు భారీ ఎత్తున పసుపుకొమ్ములతో అమ్మవారిని అలంకరించి కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



తునిలో పసుపుకొమ్ముల అలంకరణలో దర్శనమిస్తున్న వరమహాలక్ష్మి

అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి

తుని రూరల్: స్వప్రయోజనాలను పక్కనపెట్టి ఈ ఐదేళ్లు అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు సూచించారు. మండలంలోని గెడ్లబీడు సాయివేదికలో శుక్రవారం పాఠశాలల యాజమాన్య కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, నూతనంగా నియమించిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యనమల మాట్లాడుతూ ప్రజా అవసరాలు తీర్చడం ప్రధాన కర్తవ్యం అన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు చేస్తే అందుకు అవసరమైన నిధులను తీసుకువచ్చే బాధ్యత తనదే అన్నారు. వచ్చే ఐదేళ్లలో రూ.ఐదు వేల కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. అక్రమాలకు తావులేకుండా ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. పారదర్శకతంగా, జవాబుదారీతనంతో అందరూ పని చేయాలని ఎమ్మెల్యే యనమల దివ్య పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు, మున్సిపల్ మాజీ చైర్మన్లు కుసుమంచి శోభారాణి, యినుగంటి సత్యనారాయణ, ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, మూడు మండలాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు

మాజీ ప్రధాని వాజ్‌పేయికి నివాళులు

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురంలో శుక్రవారం భారత రత్న, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ప్రధాని వాజ్‌పేయి హయాంలో దేశంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, ప్రతిపక్ష నేతగా వాజ్‌పేయి ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు. ప్రధానిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. పార్టీ నాయకులు గోగుల అఖిల, భేరి గణేష్, అడబాల సాయి, పైడిసెట్టి శ్రీనివాస్, గిడియాల ప్రసన్న, కొల్లా మణికంఠ, చిట్రా శ్రీను పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: స్థానిక భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో శుక్రవారం దేశ మాజీ ప్రధాని ఏబీ వాజ్‌పేయి వర్ధంతిని నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శింగిలిదేవి సత్తిరాజు ఆధ్వర్యంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి వాజ్‌పేయి చేసిన సేవలను కొనియాడారు. పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి కల్యాణోత్సవం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో లక్ష్మీనారాయణస్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. శ్రావణ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో అర్చకులు శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహించారు. వరలక్ష్మీవ్రతం సందర్భంగా మహాలక్ష్మి అమ్మవారికి నవకలశాలతో పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారికి ధనలక్ష్మి అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. గోపూజ, స్వర్ణ పుష్పార్చన, సహస్ర కుంకుమార్చన, రాత్రి సహస్ర దీపాలంకర సేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



ఎస్.అన్నవరంలో లక్ష్మీనారాయణ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పేకాడుతున్న నలుగురి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని జె.కొత్తూరు శివారులో పేకాట శిబిరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.3200 స్వాధీనం చేసుకున్నట్లు జగ్గంపేట ఎస్సై రఘునాథరావు తెలిపారు. జగ్గంపేట మండలంలో కోడిపందేలు, జూదం, పేకాట తదితర సంఘ వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

కోటనందూరు: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌ను పురస్కరించుకొని స్థానిక అల్లూరి సీతారామరాజు సేవా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. అల్లూరి సేవా సమితి అధ్యక్షుడు లక్కా కుల బాబ్జీ ఆధ్వర్యంలో 300 అడుగుల జాతీయజెండాతో భారీ ర్యాలీ చేశారు. బస్టాండ్ సెంటర్లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.



కోటనందూరు బస్టాండు సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న అల్లూరి సంఘ ప్రతినిధులు